క్లుప్తంగా

అధిక లోడుతో వెళ్తున్న లారీపై కేసు


బండరాళ్ల లారీ

మునగపాక: ఎటువంటి అనుమతులు లేకుండా అధిక లోడుతో వెళ్తున్న బండరాళ్ల లారీపై జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పి.ప్రసాదరావు తెలిపారు. పూడిమడక రోడ్డులో అధిక లోడుతో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం అధిక లోడుతో బండరాళ్లతో వెళ్తున్న లారీని పట్టుకొని రూ.74 వేల మేర జరిమానా విధించనట్లు తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలికలకు ప్రత్యేక రక్షణ చర్యలు


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణ

ఎస్.రాయవరం: ప్రభుత్వాలు కల్పించే రక్షణ చర్యలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని అడ్డురోడ్డు సీఐ రామకృష్ణ సూచించారు. ఆదివారం స్థానిక కేజీబీవీలో ఆయన విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాలికలకు ఎదురయ్యే సమస్యల నుంచి ఎలా బయటపడాలి, తక్కువ సమయంలో పోలీస్ సహాయం ఉపయోగించుకునే విధానాలు గురించి వివరించారు. గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన ఉండాలన్నారు. చదువులో మంచి స్కోర్ చేసి ఉన్నత చదువులకు పునాదులు వేసుకోవాలన్నారు. ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకున్న వీసం తదితరులు

నక్కపల్లి: చందనాడలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, అష్టోత్తర పూజలు నిర్వహించారు. చందనాడ, నర్సాపురం, తమ్మయ్యపేట, గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, వార్డు సభ్యుడు అల్లాడ కొండ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

మునగపాకలో ట్రాఫిక్‌కు అంతరాయం


ట్రాఫిక్‌కు కారణమైన భారీ లారీ

మునగపాక: పూడిమడక రోడ్డులో మునగపాక వద్ద ఆదివారం రాత్రి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. అచ్యుతాపురం నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న భారీ వాహనం ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే పరిస్థితులు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దాంతో ఇరు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. దీనికి తోడు వివాహ కార్యక్రమాలకు రాకపోకలు సాగించేవారు సైతం అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ పి.ప్రసాదరావు తన సిబ్బందితో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


రేవుపోలవరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి రఘువర్మకు ఓటు వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.కె.ఎల్.ఎన్. ధర్మారావు కోరారు. ఆదివారం రేవుపోలవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపెయిన్ నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయులను కలిసి రఘువర్మకు ఓటు వేసి అత్యధిక మెజార్టీ గెలిపించాలని కోరారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు అల్లు అప్పలరాజు, సింహాచలం, ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సాయంత్రమైతే.. అష్టదిగ్బంధం

- పాయకరావుపేట మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లు
- కిలోమీటరు దూరానికి అరగంట ప్రయాణం
- రోడ్డు విస్తరణ ఊసెత్తని హోంమంత్రి అనిత

జంట నగరాలుగా పేరొందిన తుని-పాయకరావుపేట మధ్య దూరం కిలోమీటరే... ఈ దూరం ప్రయాణించాలంటే వాహనదారులకు అరగంటకుపైనే పడుతోంది. పాయకరావుపేటలో ట్రాఫిక్ సమస్య తీవ్రతకు అద్దం పట్టే ఈ ఘటనకు ప్రధాన కారణం ఇక్కడ మెయిన్ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడమే.. ఈ విషయంలో హోం మంత్రి అనిత ఉదాసీనంగా ఉండటంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రమైతే ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటున్నామని వాపోతున్నారు.


పాయకరావుపేట మంగవరం రోడ్డులో సాయంత్రం ట్రాఫిక్ దుస్థితి


ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహన చోదకులు, వాహనాలు

నక్కపల్లి/పాయకరావుపేట: శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పాయకరావుపేట పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు కూడా అదే స్థాయిలో పెరుగుతున్నాయి. నియోజకవర్గ కేంద్రంగా నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు ప్రధాన వాణిజ్య కేంద్రాలుగా జంట నగరాలుగా పేరొందిన తుని-పాయకరావుపేట పట్టణాలను కలిపే మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ జామ్ రోజు రోజుకు పెరుగుతోంది. సాయంత్రం ఆరు దాటితే చాలు అష్టదిగ్బంధనంలో చిక్కుకుంటోంది. పాయకరావుపేట వై జంక్షన్ నుంచి తుని గొల్ల అప్పారావు సెంటరు వరకు కిలోమీటరు దూరమే అయినప్పటికీ ప్రయాణించడానికి మాత్రం అరగంట పడుతోందంటే ఈ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్యలు ఎంత తీవ్రంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

కంపెనీల రాకతో పెరుగుతున్న జనాభా...

పాయకరావుపేట పట్టణంలో 40 వేలపైచిలుకు జనాభా నివసిస్తోంది. పాయకరావుపేటకు మున్సిపాలిటీ అయ్యేందుకు అవసరమయ్యే అన్ని అర్హతలు ఉన్నాయి. అన్ని పార్టీల్లోను రాజకీయంగా ఉద్దండులు కలిగిన పట్టణం ఇది. అయితే ఆధిపత్య పోరు, రాజకీయాల కారణంగా మున్సిపాలిటీ కాదు కదా కనీసం నగర పంచాయతీకి సైతం నోచుకోలేదు. పాయకరావుపేట పట్టణం రోజు రోజుకు అభివృద్ధి దిశగా పయనిస్తోంది. విశాఖ, కాకినాడ, రాజమహేంద్రవరం వంటి పెద్ద నగరాల్లో ఉండే షాపింగ్ మాల్స్ ఇక్కడా ఏర్పాటు చేస్తున్నారు. ఏసీ సినిమా థియేటర్లు సైతం ఇక్కడ ఉన్నాయి. పేరొందిన విద్యా సంస్థలు ఏర్పాటవుతున్నాయి. నియోజకవర్గంలో హెటిరో, డెక్కన్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లో వందలాది మంది పాయకరావుపేట పట్టణంలోనే నివసిస్తున్నారు. భారీ భవంతులు, అపార్టుమెంట్లు సైతం నిర్మించి అద్దెకు ఇవ్వడంతో పాయకరావుపేట, తుని పరిసరాల్లో ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగాల్లో, ప్రైవేటు కంపెనీల్లో పనిచేసే వారంతా ఇక్కడ నివసించేందుకు మొగ్గు చూపుతుంటారు. దీంతో నిత్యం పాయకరావుపేట మెయిన్ రోడ్డుపై రాకపోకలు సాగించేవారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.


పాయకరావుపేట చిత్రమందిర్ కూడలిలో ట్రాఫిక్

విస్తరణ ఊసెత్తని కూటమి ప్రభుత్వం..

తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డబుల్ రోడ్డు విస్తరించి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని కూటమి నేతలు ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా విస్తరణ గురించి నోరెత్తడం లేదని పట్టణ వాసులు విమర్శిస్తున్నారు. తక్షణమే ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయడంతోపాటు, రోడ్డును విస్తరించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పల్లెటూళ్ల నుంచి ప్రధాన నగరాలకు వారధిగా...

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ, విశాఖ కోలకత్తా, ముంబై వంటి మహానగరాల్లో నివసించేవారు పాయకరావుపేట పరిసర ప్రాంతాల్లో తమ సొంతూళ్లకు వెళ్లేందుకు సమీపంలో తుని రైల్వే స్టేషన్లో దిగి ఆటోలు, ద్విచక్రవాహనాలు, కార్లు, బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. వివిధ వ్యాపార, విద్యా, వైద్య అవసరాల కోసం పల్లెటూళ్ల నుంచి వచ్చే వారంతా తుని-పాయకరావుపేట రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి రద్దీ కలిగిన మెయిన్ రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. రోజూ సాయంత్రం సమయంలోను పండగ సమయాల్లో ట్రాఫిక్ రద్దీ అంతా ఇంతా కాదు. ముఖ్యంగా మంగవరం రోడ్డు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్, గౌతం థియేటర్ జంక్షన్ ప్రాంతాల్లో ట్రాఫిక్ మరీ ఎక్కువగా ఉంటోంది. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్ వ్యాపారాలు కూడా ఎక్కువే. ఇలా వ్యాపారాలు చేసేవారు మెయిన్ రోడ్డు అంచువరకు ఆక్రమించి వ్యాపారాలు చేయడం, ఇక్కడకు వచ్చే వారు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయడంతో మెయిన్ రోడ్డుపై రాకపోకలు సాగించేవారు చాలా ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. కంపెనీల బస్సులు, ఆర్టీసీ బస్సులు, విద్యా సంస్థల బస్సులు, ఆటోలు, ఇక సొంత వాహనాల్లో వచ్చేవారు, మోటారు సైకిళ్లపై రాకపోకలు సాగించేవారితో మెయిన్‌రోడ్డు అష్టదిగ్బంధనమవుతోంది. అత్యవసరమైన ఆస్పత్రి పనులపై వెళ్లేవారు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బంది పడుతున్నారు.

కానరాని ట్రాఫిక్ పోలీసులు..

పాయకరావుపేట పోలీస్ స్టేషన్‌ను సర్కిల్‌గా అప్‌గ్రేడ్ చేసి సీఐ, ఎస్‌ఐ వంటి అధికారులను సరిపడా సిబ్బందిని నియమించినప్పటికీ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఒక్కరినీ కేటాయించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగవరం రోడ్డు జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద ఇద్దరు హోంగార్డులను నియమించి ట్రాఫిక్‌ను నియంత్రిస్తే రాకపోకలకు ఇబ్బంది ఉండదని పలువురు అంటున్నారు. పట్టణంలో పెద్ద షాపింగ్ మాల్స్ ముందు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పట్టణ వాసులు అంటున్నారు. మెయిన్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేస్తే, కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం చిరు వ్యాపారులను బలి పశువులను చేసి కోర్టును ఆశ్రయించి రోడ్డు విస్తరణను అడ్డుకున్నారు. దీంతో విస్తరణ నిలిచిపోయింది. కోర్టు వివాదం కారణంగా గత ప్రభుత్వంలో యథావిధిగా ఉన్న రోడ్డునే రూ.3 కోట్లతో కొత్త రోడ్డుగా నిర్మించారు.

మెయిన్‌రోడ్డు విస్తరించక ట్రాఫిక్ సమస్యలు



పాయకరావుపేట పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఇక్కడకు వివిధ పనుల కోసం వచ్చే వారి సంఖ్య పెరుగుతోంది. మెయిన్‌రోడ్డు విస్తరించకపోవడం వల్లే ట్రాఫిక్ సమస్యలు జటిలమవుతున్నాయి. పాయకరావుపేట నుంచి తుని వెళ్లాలంటే సాయంత్రం పూట, పండగ రోజుల్లో చాలా సమయం పడుతోంది. వైద్య పనుల మీద వెళ్లే వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు చేసే వారికి ప్రత్యామ్నాయం చూపించి న్యాయం చేసి రోడ్డును విస్తరించాలి. ఇక్కడ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలి. – ఆదారి నూకరాజు, పాయకరావుపేట

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు



పాయకరావుపేటలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఉన్న షాపుల వద్ద వాహనాలు పార్కింగ్ చేయడం వల్లే రద్దీగా ఉంటోంది. రాకపోకలు సాగించే వాహనాల సంఖ్య పెరగడం, రోడ్డు విస్తరణ కాకపోవడం వల్ల కూడా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే జంక్షన్‌లో సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడతాం. – అప్పన్న, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పాయరావుపేట

వైభవంగా గణపతి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి: స్థానిక వెంకట నగర్ కాలనీలో బాల వినాయక ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయం వద్ద గణపతి హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుడు పసరకొండ పండుశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో వెంకటనగర్‌కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, బోదిగల్లం రోడ్డు తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అదే విధంగా ఇటీవల ప్రారంభించిన చేనేత కాలనీలో సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారిని ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. వీవర్స్ కాలనీ, బండారుపేట, ఎస్సీ కాలనీ భక్తులు దర్శించుకున్నారు.


వెంకటనగర్ కాలనీలో ఆలయంలో హోమాలు చేస్తున్న దృశ్యం

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

అచ్యుతాపురం రూరల్: ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన తెలపాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము తెలిపారు. ఆదివారం స్థానిక కూడలిలో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన నోరు విప్పకపోవడం దారుణమన్నారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా చర్యలు చేపట్టకుండా, కార్పొరేట్ సంస్థలు లాభపడే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. సంపన్నులకు రాయితీలిస్తూ, సామాన్యులపై భారం వేస్తున్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గూడూరు వరలక్ష్మి, సీనియర్ నాయకుడు కె.రామ సదాశివ రావు, మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎం నాయకుల నిరసన

కేజీబీవీలో భద్రతా ప్రమాణాల పరిశీలన


వసతిగృహం పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ ప్రసాదరావు


విద్యార్థినులకు కౌన్సెలింగ్ చేస్తున్న మహిళా కానిస్టేబుల్ రమ్య

మునగపాక: మండలంలోని పాటిపల్లి కేజీబీవీ వసతి గృహాన్ని ఆదివారం ఎస్‌ఐ పి.ప్రసాదరావు సందర్శించారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు వసతి గృహం పరిసర ప్రాంతాల్లోని భద్రతా ప్రమాణాలతోపాటు సీసీ కెమెరాల ఏర్పాటుకు సంబంధించి ప్రిన్సిపాల్‌కు సూచనలు చేశారు. ఎవరైనా ఆకతాయలు ఇక్కడకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యం

బాలికలు ఇష్టపడి కష్టపడి చదువుకోవాలని స్థానిక మహిళా కానిస్టేబుల్ రమ కోరారు. ఆదివారం పాటిపల్లి కేజీబీవీలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కౌమార దశలో బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా చదువుపై దృష్టి సారించవచ్చన్నారు. లక్ష్యం కోసం చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఎటువంటి ఒత్తిళ్లు లేకుండా చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. రోజూ ఉదయం కొంతసేపు వ్యాయామం చేయడం అలవరచుకోవాలని సూచించారు.

కనీస వేతనాలు అందించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్

కోటవురట్ల: పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కోటవురట్లలో నిర్వహించిన స్కూలు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల పారిశుధ్య కార్మికులకు ప్రతి నెల సకాలంలో వేతనాలు అందడం లేదని, ఇది శోచనీయమన్నారు. స్కూళ్లలో పని భారం పెరిగిందని, దీనిదృష్ట్యా 50 మంది విద్యార్థులకు ఒకరు వంతున పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. అనారోగ్య సమయంలో సెలవు మంజూరు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. మృతి చెందిన పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శివలక్ష్మి, మండల యూనియన్ అధ్యక్షురాలు జి. వరలక్ష్మి, ప్రతినిధులు సునీత, సింహాచలం, రమణమ్మ, అప్పలనరసమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అచ్యుతాపురం రూరల్: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దిబ్బపాలెం, ఆర్ అండ్ ఆర్ కాలనీ, గొర్లి ధర్మవరం, లంక ధర్మవరం, వెదురువాడ, వైఎస్ఆర్ నగర్, సాయిప్రియా లే-అవుట్, బర్మా కాలనీ, మార్టూరు రోడ్, మరిడిమాంబ కాలనీ గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఎస్.రాయవరం: స్థానిక ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్టుకొమ్మలు తొలగింపులో భాగంగా సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఎస్.రాయవరం, సర్వసిద్ధి, సైతారుపేట, వాకపాడు, వెంకటాపురం ఆక్వా పరిశ్రమలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని సూచించారు.

మురుగు పరుగును ఆపేదెవరు?


రోడ్డు మధ్యలో మురుగునీటి కాలువ

అచ్యుతాపురం: మండలంలోని కీలక పంచాయతీల్లో ఒకటైన ఎం.జగన్నాథపురం దుర్గంధ భరితంగా మారుతోంది. ఇక్కడ కనీస సదుపాయాల్ని కల్పిస్తూ, సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు, పాలకులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు. పర్యవసానంగా గ్రామం నుంచి రామగిరి వెళ్లే మార్గంలోని హైస్కూల్‌కు సమీపంలో రోడ్డుపై మురుగు పారుతోంది. దీనికి శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ఆ మార్గంలో వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో వాలు ఎత్తుగా ఉండటంతో ఎగువ ప్రాంతాల వారు ఉపయోగించే మురుగునీటిని మళ్లించడం గానీ, పక్కాగా డ్రైనేజీ నిర్మించి దీనిపై మూత వేయడం గానీ చెయ్యాలి. పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉండే ఈ సమస్య విషయంలో స్థానిక అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఐ సన్నిబాబు

నక్కపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు వాడే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని దుర్వినియోగం చేస్తూ అనేక అక్రమాలకు బ్లాక్ మెయిల్స్‌కు పాల్పడుతున్నారన్నారు. ఫోన్లో వీడియోలు, అసభ్యకర సందేశాలు పంపించడం, ప్రొఫైల్ పిక్స్‌ను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగడం వంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా, ఆధార్, పాన్‌కార్డు వివరాలు కావాలంటూ ఫోన్లు చేసి ఓటీపీలు తెలుసుకుని నగదు కాజేస్తున్నారన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడమే కాకుండా, ఇళ్లకు వెళ్లినప్పుడు నిరక్షరాస్యులైన కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారికి తెలియజేయాలన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేసే విషయంలో సహకరిస్తామంటూ పాస్‌వర్డ్ తెలుసుకుని నగదు కాజేస్తున్నారన్నారు. ఇటువంటి వారిపైనా జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల సిబ్బంది లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనం నడపాలన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో మరిడిమాంబ పండగ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు చర్యలు తీసుకున్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కంటి ఆపరేషన్లకు 20 మంది ఎంపిక


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యురాలు అరుణ


ఆపరేషన్లకు కంటి రోగుల తరలింపు

కోటవురట్ల: విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తాళ్లపాలెంలోని రామాలయం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 72 మందికి వైద్య సేవలందించారు. వీరిలో 20 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శంకర్ ఫౌండేషన్ వైద్యురాలు అరుణ రోగులను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆపరేషన్లు అవసరమైన వారికి శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. కంటి నరాలు, కంటిపై పొర చికిత్సల కోసం చెరో ఇద్దరు, కంటి నీటి కాసులు, కంటి రెప్పలు, చిన్న పిల్లల కంటి చికిత్సల కోసం ఒక్కొక్కరు వంతున ఎంపిక చేసి వారికి ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో ఆస్పత్రిలో చికిత్స నిర్వహించడానికి సిఫార్స్ చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, ఫౌండేషన్ క్యాంపు మేనేజర్ ఎం. అరుణకుమార్, ఆప్తాలమిక్ లావణ్య, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

తీరంలో బయటపడ్డ విద్యుత్ స్తంభం పునాది


రేవుపోలవరం తీరంలో పైకి తేలిన విద్యుత్ స్తంభం పునాది

ఎస్.రాయవరం: రేవుపోలవరం బీచ్‌లో సముద్ర కెరటాలు వెనక్కి వెళ్లిపోవడంతో విద్యుత్ స్తంభాల పునాదులు బయటపడ్డాయి. టూరిజం శాఖ గతంలో బీచ్ ఒడ్డున విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసింది. అవి వినియోగంలోకి రాకపోవడంతో పునాదులు కప్పుకుపోయాయి. ఇప్పుడు సముద్రం 50 నుంచి వంద మీటర్లు కెరటాలు వెనక్కి వెళ్లడంతో ఇసుకలో కప్పుకుపోయిన విద్యుత్ స్తంభాల పునాది దిబ్బలు పైకి తేలుతున్నాయి. వీకెండ్‌లో పెద్ద ఎత్తున సందడి చేసే సందర్శకులు వీటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బీచ్‌లో టూరిజం అభివృద్ధి పనులు చేపట్టి పర్యాటకులకు సౌకర్యాలు పెంచాలని కోరుతున్నారు.